పదికి ప్రత్యేక ప్రణాళిక

- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు
- ఈసారి ఆరు పేపర్లే

బిక్కవోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే పరీక్షల షెడ్యూలు విడుదలైంది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు ముందుకెళుతున్నారు. ఇందుకోసం పిల్లలకు ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు, వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్ అందించారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 4,863 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 9 వరకూ, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.


కొంకుదురులో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పేపర్ల కుదింపు

గతంతో రెండేళ్ల కరోనా కారణంగా పరీక్షలకు దూరమైన విద్యార్థులు గత విద్యా సంవత్సరం నుంచి పరీక్షలు రాస్తున్నారు. గతంతో 11 పేపర్లకు పరీక్ష నిర్వహించేవారు. కరోనా సమయంలో ఆ పేపర్లను కుదించారు. గతంలో టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి పబ్లిక్ పరీక్ష పేపర్లను 80 మార్కులకు జరిపేవారు. ఇంటర్నల్ మార్కుల్లో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆ విధానం రద్దు చేశారు. పబ్లిక్ పరీక్షల పేపర్లను పూర్తి వంద మార్కులకు నిర్వహించనున్నారు.

మార్కుల ఆధారంగా..

విద్యార్థులకు సమ్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపి, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ ద్వారా స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. మండలాల వారీగా అనపర్తిలో 805, బిక్కవోలులో 637, రంగంపేటలో 612, పెదపూడిలో 570, సీతానగరంలో 474, కోరుకొండలో 888, రాజానగరంలో 877 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రత్యేక తరగతులు



విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి ఎంతో కీలకం. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం.

– కొవ్వూరి అమ్మిరెడ్డి, హెచ్ఎం, కొంకుదురు హైస్కూలు

అందరికీ ఉపయోగం



ప్రత్యేక తరగతులు విద్యార్థులందరికీ ఎంతో ఉపయోగం. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడం వల్ల మంచి మార్కులు సాధించవచ్చు. వెనుకబడిన విద్యార్థుల పురోగతి సాధించడానికి ఇది మంచి అవకాశం.

– ధనికొండ పాప, టెన్త్ విద్యార్థిని, కొంకుదురు హైస్కూలు

రేపు ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలక వర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించనుంది. నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. ఆ రోజు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్‌గా సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా అడబాల వెంకటేశ్వరరావుతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. మధ్యాహ్నం 1.30కు స్థానిక గంగిరెడ్డి నర్సింగ్ హోమ్ నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా బయలుదేరి అనపర్తి, పొలమూరు మీదుగా సాయంత్రం 4 గంటలకు మండలంలోని రామవరం చేరుకుంటారు. అక్కడ రూ.1.75 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన ప్రారంభోత్సవం, అనంతరం రామవరంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం అభినందన సభ నిర్వహిస్తారు. ఈ సభకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కాకినాడ రూరల్, నిడదవోలు, కాకినాడ టౌన్, కొత్తపేట, గోపాలపురం ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జి.శ్రీనివాస్ నాయుడు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకట్రావు, శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు హాజరవుతారు.

కోటపాడులో 144 సెక్షన్

రంగంపేట: కోటపాడులో ఆదివారం నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు 144 సెక్షన్ విధించినట్టు తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. ఆ గ్రామంలో స్థల వివాదం నేపథ్యంలో ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు ఆధ్వర్యంలో ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. అవి సఫలం కావడంతో సోమవారం శివుని విగ్రహం ఏర్పాటు చేసుకోవాడానికి పోలీసు, రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో సోమవారం శివుని విగ్రహం ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని ఆదివారం రాజమహేంద్రవరం డీఎస్పీ భక్తవత్సలం, అనపర్తి సీఐ శ్రీనివాస్ పరిశీలించారు.

సూర్య దేవాలయానికి పోటెత్తిన భక్తులు


స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడలోని ఉషా, ఛాయ, పద్మిని, సంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి దర్శనానికి మాఘమాసం రెండో ఆదివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు.

మాజీ మంత్రి మృతికి సంతాపం

మధురపూడి: రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ మృతికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, బీజేపీ రాష్ట్ర నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి, వైఎస్సార్ సీపీ మాజీ కోరుకొండ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి ఆదివారం సంతాపం తెలిపారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన ఘనత వసంత కుమార్‌కు దక్కిందన్నారు.

ఒకటిన వీరేశ్వరస్వామి కల్యాణం

మధురపూడి: బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఫిబ్రవరి ఒకటిన నిర్వహించనున్నట్టు ధర్మకర్త క్రొవ్విడి సత్రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారన్నారు.

ఆశాజనకంగా శనగ పంట


చంద్రేడులో సాగు చేసిన శనగ పంట

రంగంపేట: మండలంలోని నల్లరేగడి నేలల్లో వేసిన శనగ పంట ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో మొక్కలు కళకళలాడుతున్నాయి. కొద్దిరోజులుగా మంచు, చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆ వాతావరణం కలిసొచ్చింది. సాధారణంగా ఈ పంటకు ఒకటి, రెండు నీటితడులుంటే సరిపోతుంది. మంచు కారణంగా మొక్కలు ఎదుగుతాయి. వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాలలో రైతులు పత్తి, మినుము పంటలు సాగు చేయగా అవి ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీపై సుమారు 80 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో సుమారు 1,260 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. విత్తనాలు వేసి 50 రోజులు కావడంతో ముందుగా వేసిన చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లోని పొలాల్లో మొక్కల నుంచి పూత, పిందెలు వచ్చాయి. మరో 40 రోజుల్లో పంటచేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ. 20 వేల వరకూ పెట్టుబడి పెట్టామని ఈ ఏడాది ఎకరాకు 7 నుంచి 8 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు.

వైభవంగా మాచరమ్మ జాతర


మాచరమ్మ గద్దె


ఆలయంలో పూజలు నిర్వహించి, సమర్పించిన అమ్మవారి గద్దెలు

అనపర్తి: పొలమూరు శివారు చిన పొలమూరు గ్రామ దేవత మాచరమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఏటా మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే ఆదివారం రాత్రి అమ్మవారి జాతర, సోమవారం తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి ఆలయంలోని గద్దె పీటను కిందకుదించడంతో జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి గద్దె పీటను శిరస్సును ధరించిన భక్తులు పొలమూరు పాకలతో పాటు పొలమూరులో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు సైతం అమ్మవారి ప్రతిరూపం, విభూది పండు, వివిధ రకాల పుష్పాలు, అరటి పండ్లు ఉంచిన పళ్లేలను శిరస్సున ధరించి గద్దె పీటను అనుసరించారు. జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సోమవారం అమ్మవారి తీర్థం జరుగుతుంది.

కేంద్ర పథకాలను వివరించాలి


దత్తును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పెదపూడి: భారతీయ జనతాపార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు అన్నారు. జి.మామిడాడ గ్రామంలో ఆదివారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దత్తు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. అనంతరంఆయను ఘనంగా సత్కరించారు. ఆయన, పార్టీ నాయకులు రాజుపాలెం గ్రామంలో మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షించారు.

ఆర్థిక ఇబ్బందులతో నర్సరీ రైతు ఆత్మహత్య

కడియం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన నర్సరీ రైతు ఏ.శ్రీగణేశ్ (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన పన్నెండేళ్లుగా నర్సరీ వ్యాపారం చేస్తున్నాడు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు మొక్కలను సరఫరా చేసేవాడు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు ఇతనికి అరువుపై మొక్కలు ఇచ్చేవారు. కానీ ఇతర రాష్ట్రాల నుంచి డబ్బులు రాకపోవడంతో రైతులకు డబ్బులు చెల్లించేందుకు అప్పులు చేశారు. అవి తీర్చలేక మానసిక వేదనతో కలుపు మందు తాగాడు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కడియం పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నసమారాధన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామదేవత దోసాలమ్మ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా దోసాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో గ్రామ ప్రజల తరఫున అమ్మవారి గరగలకు పానుపు వేసి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మదుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన ఫిబ్రవరి 2వ తేదీ వరకూ 21వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ధ్వజారోహణ జరిగింది. సాయంత్రం తిరువీధి (గరుడ సేవ) ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఊరేగింపు ప్రారంభించారు. అవసరాల కిరణస్వామి, ముప్పిరాల అనంతాచార్యులు, పరాశర రఘునాథ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయం నుంచి కంబాల చెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, సాయికృష్ణ, ఊర్వశి సెంటర్, జాంపేట మీదుగా ఊరేగింపు సాగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా భక్తులుక్త స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం హోమాలు, సాయంత్రం తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఈ విద్యాభ్యాసం చేసిన 1985 – 90 విద్యా సంవత్సరాలకు చెందిన విద్యార్థులు జాతీయ రహదారి అనుకుని ఉన్న జీపీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానికంగా పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు తరలివచ్చారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మిత్రులతో సరదాగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి, సన్మానించారు.

పందుల స్వైరవిహారం

- ప్రజలు, రైతులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంతో పాటు ఇతర గ్రామాల్లో పందులు సైరవిహారం చేస్తున్నాయి. ఇళ్ల వద్ద హల్‌చల్ చేస్తూ ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ఇళ్ల బయట ఏమి ఉంచాలన్నా ప్రజలు, పంటలను చేస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెంపకందారులు నిర్లక్ష్యంగా పందులను ఊళ్లపై వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మండలంలో సుమారు రెండువేల పందులకు పైగా తిరుగుతున్నాయని అంచనా.

పెంపకందారుల దాడులు

మూడు నెలల క్రితం చినకొండేపూడి రైతులు తమ పంటలను పాడుచేస్తున్నాయని రంపఎోడవరం నుంచి పందులు పట్టుకునే వారిని తీసుకువచ్చారు. కొన్ని పందులను పట్టుకుని ఆటోలో తీసుకువెళుతున్న సమయంలో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం వద్ద సీతానగరానికి చెందిన పందుల పెంపకందారులు అడ్డుకుని దాడి చేశారు. దీనితో కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ సమయంలో సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద పందుల పెంపకందారులు తమ పందులను ఊళ్లలో తిరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే యథాతథంగా పందులను గ్రామాల్లో వదిలేశారు.


సీతానగరంలో సంచరిస్తున్న పందులు

భయపడుతున్నాం



గ్రామాల్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులపై దాడులకు దిగుతున్నాయి. పిల్లలు బయట తిరగాలంటేనే భయపడుతున్నారు. ఇళ్ల బయట ఏమి ఉంచినా పాడు చేస్తున్నాయి. వాటివల్ల రోగాలు వస్తాయని భయపడుతున్నాం.

– తోరం బ్రహ్మాజీ రావు, సీతానగరం

చర్యలు తీసుకోవాలి



పొలాల్లో పందులు పిల్లలను పెట్టి రైతులపై దాడులు చేస్తున్నాయి. వాటిని పట్టుకోనేవారిని తీసుకువస్తే పెంపకందారులు దాడి చేస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని పందులు తిరగకుండా కఠినంగా వ్యవహరించాలి.

– ముదునూరి ప్రసాదరాజు, చినకొండేపూడి

దేవాలయ కమిటీల నియామకానికి ఉత్తర్వులు

- క్రమశిక్షణ, విధేయతకు పట్టాభిషేకం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి



సీటీఆర్ఐ: నగరంలోని పలు ప్రముఖ దేవాలయాలకు పాలక వర్గాలను (కమిటీలు) నియమించేందుకు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మాదేపల్లి విజయరాజు ఉత్తర్వులు జారీ చేసినట్టు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీకి విధేయత, క్రమశిక్షణతో ఉన్నవారిని గుర్తించి ఆయా ఆలయ కమిటీలలో నియమిస్తామన్నారు. పందిరి మహదేవుడు కోటిలింగాల సత్రం, గౌతమీ జీవకారుణ్య సంఘం, చందా చౌల్ట్రీ, ఉమా మార్కండేయశ్వరస్వామి దేవాలయం, ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవాలయం, సత్యనారాయణస్వామి దేవస్థానం పాలక మండళ్లను వచ్చేవారం రోజుల్లోగా నియమించబోతున్నట్టు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్లు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పిల్లి సుభాస్ చంద్రబోస్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ సంయుక్తంగా ఈ దేవస్థాన కమిటీలకు సరైన వారిని ఎంపిక చేస్తారన్నారు.

అంకితభావానికి చిరునామా కేశవభట్ల

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విధి నిర్వహణలో అంకిత భావం, సమాజంపై సేవాభావం కేశవభట్ల శ్రీనివాసరావును సమర్థవంతమైన అధికారిగా నిలబెట్టాయని సినీ నటుడు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ కొనియాడారు. రైల్వే శాఖలో టికెట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాసరావును ఆదివారం రాత్రి రివర్‌బే ఫంక్షన్ హాల్లో ఘనంగా సత్కరించారు. ముందుగా రైల్వే స్టేషన్ నుంచి ఆయనను గజమాలతో సత్కరించి రివర్‌బే వరకూ భారీ ఊరేగింపుగా రైల్వే శాఖలకు చెందిన సిబ్బంది తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలే కాకుండా సమాజంపై బాధ్యతతో శ్రీనివాసరావు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేసినట్లు అనిపించడం లేదని, పూర్తి సమయం సమాజ సేవకు సిద్ధమైనట్టు తెలుస్తోందన్నారు. ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాసరావు అందించిన సేవలకు అనేక అవార్డులు దక్కాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఎవరికీ సాయం కావాలన్నా ముందుకు వచ్చి సహాయపడే వ్యక్తి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో చీఫ్ కమర్షియల్ మేనేజర్ జాన్ ప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'స్పందన'

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ అమ్మాజీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు.

కోడిపందేలపై దాడి

సీతానగరం: మండలంలోని సింగవరం శివారున కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి రూ.1,760, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

నేటి నుంచి సర్వే


బిక్కవోలు: మండలంలోని రెండు రోజుల పాటు సిటిజన్ సర్వే జరుగుతుందని ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వలంటీర్ ద్వారా సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో సిబ్బంది తెలుసుకోవాలన్నారు. లబ్ధిదారుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఈ సర్వే పూర్తి చేయాలన్నారు.

నల్ల బ్యాడ్జీలతో తపాలా ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

అనపర్తి: ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలను విధించిన కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ గ్రామీణ తపాలా ఉద్యోగులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం కోశాధికారి వై.కామేశ్వరి మాట్లాడుతూ అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం అనపర్తి తపాలా కార్యాలయం వద్ద నిరసన చేపట్టామన్నారు. ఆదివారం కూడా కార్యాలయాలు తెరచి పనిచేయాలని, బ్రాంచి ఆఫీసులో సిబ్బంది కుదింపు వంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం చేశామన్నారు. సోమవారం రామచంద్రపురం బ్రాంచ్ పరిధిలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.లలిత, వై.పల్లారావు పాల్గొన్నారు.

ఆలోచనలకు పదును పెట్టాలి


ప్రాజెక్టు వర్కును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ బొజ్జి రాజు

రాజానగరం: నూతనావిష్కరణలతో కూడిన ప్రాజెక్టులను తయారు చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు మేధాసంపత్తిని వృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని ఈఓపీఆర్డీ బొజ్జి రాజు అన్నారు. రాజమహేంద్రవరం శ్రీచైతన్య స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్టు వర్కును చూసిన ఆయన ఆ విద్యార్థిని అభినందించారు. ఆలోచనలకు పదును పెడితే మరిన్ని అద్భుతాలు చేయవచ్చన్నారు.

తుంగపాడులో లెనిన్ శత వర్ధంతి


సమావేశంలో మాట్లాడుతున్న తాన్య

రాజానగరం: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మండలంలోని తుంగపాడులో ఆదివారం ప్రపంచ కార్మిక వర్గ మహోపాధ్యాయుడు లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చీకట్ల వెంకటేశ్వర్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి.తాన్య, సీపీఐ నగర కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కె.భాను ప్రసాద్, దినేష్, ధర్మేష్, భీమ శంకర్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

గోకవరం: మండలంలోని అష్టలక్ష్మి ఆలయం సమీపంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. అష్టలక్ష్మి గుడి సమీపంలో జరుగుతున్న మైనింగ్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొండను అనుకుని సుమారు 12 వేల మంది ప్రజలు జీవిస్తున్నారన్నారు. మైనింగ్ వల్ల వీరు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, అలాగే ప్రమాదాలు జరిగే అవకాశాలు సైతం ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని మైనింగ్‌ని నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి.కొండలరావు, కె.జ్యోతిరాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.